# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఛత్తీస్‌గఢ్‌లో ఈరోజు జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్ లలో 30 మంది మావోయిస్టులు మరణించారు.
- నియోజకవర్గాల ప్రతిపాదిత పునర్విభజన అంశంపై విపక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వ్యవసాయం ,రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి చెప్పారు.
- ఖేలో ఇండియా పారా గేమ్స్ రెండవ సంచికను కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖా మంత్రి మన్సూఖ్ మాండవీయ ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు.
- భారతదేశం సేవా రంగం నుండి ఉత్పత్తి దేశంగా మారడానికి కృషి చేయాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.

======================

ఛత్తీస్‌గఢ్‌లో ఈరోజు జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్ లలో 30 మంది మావోయిస్టులు మరణించారు. బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘా సమాచారం అందడంతో భద్రతా దళాల సంయుక్త బృందం సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ఈ రోజు ఉదయం నుండి గంగులూరు ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 26 మంది మావోయిస్టుల మృతదేహాలను సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు పెద్ద సంఖ్యలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను కూడా సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ కి చెందిన ఒక సైనికుడు కూడా మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన మరో ఆపరేషన్‌లో జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మరణించారు. ఈ సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

=======================

నక్సలైట్లపై ప్రభుత్వం కఠినమైన వైఖరితో ముందుకు సాగుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అనేక సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ లొంగిపోని తీవ్రవాదుల పట్ల ప్రభుత్వం జీరో-టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తోందని అమిత్ షా సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. “నక్సల్ ముక్త్ భారత్ అభియాన్” దిశగా సైనికులు ఈ రోజు మరో పెద్ద విజయాన్ని సాధించారని.. వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి భారతదేశం నక్సల్ రహితంగా మారబోతోందని అమిత్ షా తెలియజేశారు.

=======================

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల ప్రతిపాదిత పునర్విభజనపై డిఎంకె మరికొంతమంది ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. డిఎంకె పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు ప్రతిపాదిత పునర్విభజనను నిరసిస్తూ.. టీ-షర్టులు ధరించి నినాదాలు చేశారు. దీంతో సభ పలుమార్లు వాయిదా పడింది. నిరసన తెలుపుతున్న సభ్యుల వస్త్రధారణపై ప్రిసైడింగ్ అధికారి అభ్యంతరం వ్యక్తం చేశారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో సభను రేపటికి వాయిదా వేశారు. ఈ అంశంపై రాజ్యసభలో కూడా ఈరోజు వాయిదాపర్వం కొనసాగింది.

=======================

కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి చెప్పారు. ఈరోజు ఆయన పార్లమెంటు వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని.. పంటల కనీస మద్దతు ధరను గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. అదే విదంగా పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం శంభు, ఖనౌరి సరిహద్దులలో నిరసన స్థలం నుండి రైతులను ఖాళీ చేయించడంపై మంత్రి స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిరసనకారులను తొలగించిందనే ప్రతిపక్షం ఆరోపణలను తోసిపుచ్చారు.

=======================

పంజాబ్ పోలీసులు శంభు, ఖానౌరి సరిహద్దుల వద్ద నిరసన తెలుపుతున్న రైతులను బలవంతంగా అక్కడ నుంచి తరలించారు. పంజాబ్ పోలీసులు శంభు సరిహద్దు వెంబడి పంజాబ్ వైపుగా ఉన్న మిగిలిన తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి రహదారి మార్గ ప్రయాణాన్ని సుగుమం చేయడానికి ఆపరేషన్‌ను తిరిగి ప్రారంభించారు. పంజాబ్ రైతులు ఢిల్లీకి వెళ్లకుండా నిరోధించడానికి నిర్మించిన సిమెంట్ బారికేడ్లను హర్యానా పోలీసులు తొలగించడం కూడా ప్రారంభించారు. శంభు సరిహద్దు వద్ద సంవత్సరం పాటు మూసివేయబడిన శంభు - అంబాల రహదారిని క్లియర్ చేయడానికి జెసిబి ఇతర యంత్రాలను మోహరించారు.

ఇదిలా ఉండగా శంభు, ఖనౌరి చెక్ పోస్టుల నుండి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఖాళీ చేయడాన్ని పారిశ్రామికవేత్తలు, సాధారణ ప్రజలు స్వాగతించారు. చెక్ పోస్టులను తెరవాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తూ.. పంజాబ్ రాష్ట్రం ప్రతి నెలా 1,500 కోట్ల రూపాయల నష్టాలను చవిచూస్తోందని లూథియానాకు చెందిన MSME ఫోరం అధ్యక్షుడు బాదిష్ జిందాల్ అన్నారు.

=======================

ఖేలో ఇండియా పారా గేమ్స్ రెండవ సంచికను కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖా మంత్రి మన్సూఖ్ మాండవీయ ఈరోజు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభించారు. 6 విభిన్న క్రీడా పోటీలలో మొత్తం 1,300 మందికి పైగా పారా - అథ్లెట్లు పాల్గొనున్నారు. ఖేలో ఇండియా స్థిరంగా దాని ప్రాముఖ్యతను

పెంచుకుంటోందని క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికని ప్రారంభ ఉపన్యాసంలో మన్సూఖ్ మాండవీయ పేర్కొంటూ ...

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

ప్రపంచ వేదికపై భారత దేశాన్ని మరింత ఆకర్షణీయమైన భాగస్వామిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ రోజు ఆయన అమెరికా-చైనా ఉద్రిక్తతలు, రష్యా ఉక్రెయిన్ వివాదం యొక్క ప్రభావాలు , ప్రపంచ దక్షిణాది దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించారు. పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను అధిగమించడానికి భారత్ కు మరిన్ని దేశాల భాగస్వామ్యం అవసరమని జైశంకర్ మాట్లాడుతూ...

(వాయిస్ 38 సెకన్లు)

=======================

భారతదేశం సేవా రంగం నుండి ఉత్పత్తి దేశంగా మారడానికి కృషి చేయాలని కేంద్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈ రోజు సాయంత్రం న్యూఢిల్లీలో జరిగిన చిప్స్ టు స్టార్టప్ ప్రోగ్రామ్ అవార్డు ప్రదానోత్సవంలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు, అంకుర సంస్థలు విద్యార్థులు, పరిశోధకులు ఆవిష్కరణలను నడిపించడానికి కొత్త పరిష్కారాలను రూపొందించడానికి కలిసి వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతిభావంతులైన వ్యక్తులందరూ చేతులు కలిపి పరిష్కారాలను తీసుకురావాలని కోరారు. సేవా రంగంలో భారతదేశం ఇప్పుడు బాగా రానిస్తుందని ఉత్పత్తి రంగంలో కూడా ఇలాగే పురోగతి సాధించాలంటే అందరూ సహకరించాలని అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ...

(వాయిస్ 42 సెకన్లు)

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ ఈరోజు లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 75 వేల 449 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 899 పాయింట్ల లాభంతో 76 వేల 348 వద్ద ముగిసింది.

=======================
=======================